సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం । 5 । జూలై । 2025



ఆలోచనకు పదును... సృజనకు అదును

ఇన్‌స్పైర్ మనక్- 2005 అవార్డులకు భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. -8లో



దేశం కోసం జీవితాన్ని త్యాగం చేసిన వీరుడు అల్లూరి

దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.290	రూ.350
రెండోరకం	రూ.200	రూ.280

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1,392 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

మొహర్రం ఉత్సవాలకు సర్వం సిద్ధం



కొలువుతీరిన గంధపుపీరు

చిన్నమండెం: మొహర్రం ఉత్సవాల నిర్వహణకు చిన్నమండెంలో సర్వం సిద్ధం చేశారు. ఉత్సవాల్లో కీలక ఘట్టమైన అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమం శనివారం జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కడప పెద్ద దర్గా పీఠాధిపతి ఆరీఫుల్లాహుస్సేనీ పాల్గొనే ఈ కార్యక్రమానికి పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మార్గదర్శకుల ఎంపిక పూర్తిచేయాలి: కలెక్టర్

రాయచోటి: పేదరికం నిర్మూలనకు పీ-4 సర్వే ద్వారా మండలాల వారీగా గుర్తించిన బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు మార్గదర్శకుల ఎంపిక పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి పి-4పై జిల్లా కలెక్టర్లు, మంత్రులు ఎమ్మెల్యేలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫిరెన్సు హాల్ నుంచి వీడియో కాన్ఫిరెన్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి, జేసీ ఆదర్శ రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు. వీసీ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 66వేల బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. వీరికి మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే పి-4 లక్ష్యమన్నారు.

సొరంగం.. మార్గం సుగమం

కడప మీదుగా వెళ్లే జాతీయ రహదారి -40 మార్గంలో కీలకమైన గువ్వల చెరువు ఘాట్ ఉంది. ఇక్కడ ప్రమాదకర మలుపులు ఉన్నందున.. తరచూ ఏదో ఒక సంఘటన జరుగుతూ ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం తాజాగా ఇక్కడ సొరంగ మార్గానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తద్వారా సురక్షిత ప్రయాణానికి అవకాశం ఏర్పడింది. దీంతో ఎన్నో ఏళ్ల నాటి కల త్వరలో సాకారం కానుంది. అలాగే అందమైన కొండల మధ్య సొరంగ మార్గం ఏర్పాటు కావడంతో.. ఆ ప్రాంతం పర్యాటక కేంద్రంగా మారే అవకాశం ఉంది.

- గువ్వల చెరువు ఘాట్‌లో ఏర్పాటుకు సన్నాహాలు
- రూ.920 కోట్ల అంచనా వ్యయం
- మొత్తం 7 కిలోమీటర్ల దారి
- అందులో 3 కి.మీ సొరంగం
- టన్నెల్‌తో ప్రమాదాలకు అడ్డుకట్ట
- వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడే ప్రతిపాదనలు



కడప రూరల్: కర్నూలు, చిత్తూరు మధ్యలో కడప అనుసంధానంగా ఉండే జాతీయ రహదారి-40 మార్గం ఎంతో కీలకమైనది. ఈ ఘాట్ కడప నగరానికి దాదాపు 15 కిలో మీటర్ల దూరంలో ఉంది. వాహనదారులు, ముఖ్యంగా భారీ వాహనదారులు ఈ ప్రమాదకర మలుపుల్లో వెళ్లాలంటే చాలా అప్రమత్తంగా ఉండాలి.

నాలుగు వరసల దారి..

కేంద్ర ప్రభుత్వం ఇటీవలనే కడప గువ్వల చెరువు ఘాట్ వద్ద ప్రమాదాల నివారణకు, సురక్షిత ప్రయాణానికి సొరంగ మార్గం నిర్మించాలని సంకల్పించింది. ఆ మేరకు అంచనా వ్యయం రూ.920 కోట్లుగా నిర్ణయించింది. ఇక్కడ ప్రస్తుతం వాహనాలు రాకపోకలు సాగించడానికి దాదాపు 30 అడుగుల రహదారి ఉంది. సొరంగ మార్గం నిర్మించే ప్రాంతంలో కడప వైపు నుంచి చిన్న బిడికి గ్రామం వద్ద నుంచి.. ఘాట్‌కు ఆవలి వైపు ఉన్న గువ్వలచెరువు ప్రాంతం వరకు దాదాపు 7-8 కిలోమీటర్ల దూరం ఉంటుంది. మధ్యలో సొరంగ మార్గం (టన్నెల్) దాదాపు 3 కిలోమీటర్ల దూరం ఉండనుంది. అంటే మొత్తం 7-8 కిలో మీటర్ల వరకు (సొరంగ మార్గంతో కలిపి) వాహనాలు రాకపోకలు సాగించడానికి నాలుగు వరుసల రహదారులను నిర్మించనున్నారు. ఈ టన్నెల్‌ను ఏ ప్రాంతంలో ఏర్పాటు చేసేది అత్యున్నత స్థాయి నిపుణులు నిర్ధారించాల్సి వుంది. ఇప్పటికే ఢిల్లీ నుంచి నేషనల్ హైవే టన్నెల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌తో మరి కొంత మంది నిపుణులు ఇక్కడికి వచ్చి.. ప్రాథమికంగా ఈ ప్రాంతాలను పరిశీలించి వెళ్లినట్లుగా తెలిసింది. కాగా ఈ మార్గానికి అటవీ, పర్యావరణ తదితర శాఖల నుంచి అనుమతులు రావాల్సి వుంది.



గువ్వలచెరువు ఘాట్ ప్రాంతంలో నేషనల్ హైవే టన్నెల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్, నిపుణుల పరిశీలన (ఫైల్)

సొగసైన సురక్షితమైన ప్రయాణం



పవిత్రమైన, సుందరమైన శేషాచలం అటవీ కొండలు, పాలకొండల సముదాయంలో గువ్వలచెరువు ఘాట్ ఉంది. ఈ ప్రాంతం అందమైన అటవీ ప్రాంతం, వర్షాకాలంలో ఎటు చూసి నా పచ్చదనం .. జలపాతాల సోయ గాలు కనువిందు చేస్తుంటాయి. అలాంటి ప్రకృతి మధ్య సొరంగ మార్గం ఏర్పాటు కావడంతో.. ఆ ఏరియా అంతా పర్యాటక ప్రాంతంగా మారే అవకాశం ఉంది. ఈ మార్గం గుండా ఇప్పటికే హైదరాబాద్, కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున వాపార, వ్యవసాయ రంగానికి సంబంధించి ఉత్పత్తులు రవాణా అవుతున్నాయి. ఉదాహరణకు మన జిల్లా నుంచి సిమెంట్, మైనింగ్, అరటి, బత్తాయి తదితర వస్తువులు గువ్వలచెరువు ఘాట్ మీదుగా పీలేరు, చిత్తూరు, చెన్నై, మదనపల్లె, బెంగళూరు తదితర ప్రాంతాలకు రవాణా అవుతున్నాయి. చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి ఇక్కడికి ఫ్యాక్టరీలకు మిషనరీ, ఇతర పరిశ్రమలకు సంబంధించిన విడి భాగాలు, కెమికల్స్‌తోపాటు టమోటా తదితర కూరగాయలు, కొబ్బరి బొండాలు.. ఇలా పలు రకాల వస్తువులు భారీ వాహనాల్లో వస్తుంటాయి. వీటిలో కొన్ని వివిధ కారణాల చేత ఘాట్ మలుపుల్లో చిక్కుకొని ప్రమాదాలకు గురి అవుతున్నాయి. సొరంగ మార్గం ఏర్పాటైతే దాదాపు ఒక గంట ప్రయాణం కలిసి రావడంతోపాటు సుఖంగా.. సురక్షితంగా ప్రయాణం సాగించడానికి వీలు కలుగుతుంది.

నాడే ప్రతిపాదనలు

ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్న సమయంలోనే పలు ప్రాజెక్టులు పూర్తయ్యాయి. ఎన్నో చారిత్రాత్మక పథకాలను అమలు చేశారు. జాతీయ రహదారులతోపాటు జిల్లా, గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టింది. అందులో భాగంగానే గువ్వలచెరువు ఘాట్‌లో సొరంగ మార్గానికి ప్రతిపాదనలు పంపారు. కాగా వైఎస్సార్ మరణానంతరం ఈ పనులు ముందుకు సాగలేదు.

మలుపుల్లో తరచూ మృత్యు ఘంటికలు

ఇక్కడ చాలా ఏళ్ల క్రితం బ్రిటీష్ హయాంలో రోడ్డును నిర్మించారు. ఈ ఘాట్ మార్గంలోనే ఇప్పుడు అందరూ ప్రయాణాలు సాగిస్తున్నారు. ఒక అంచనా ప్రకారం ఈ మార్గంలో ఒక నిమిషానికి ఒక వాహనం వెళ్తోంది. పలు రకాల వాహనాలు ముఖ్యంగా భారీ వాహనదారులకు ఈ ఘాట్ విషమ పరీక్షను పెడుతుంది. ఇక్కడ అత్యంత జాగ్రత్తగా వాహనం నడపక పోతే ప్రమాదం జరుగుతుంది. ఒక అంచనా ప్రకారం ఒక నెలలో 2-3 ప్రమాదాలు జరుగుతుంటాయి. ప్రాణ నష్టం కూడా సంభిస్తుంటుంది. కడప వైపు నుంచి ప్రయాణించే వైపు ఘాట్‌లో ఉండే.. శ్రీ ఆంజనేయ స్వామి గుడి వద్ద ఉన్న మలుపు, ఆ పైన ఉన్న మలుపుల వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గువ్వలచెరువు నుంచి కడప వైపు వచ్చే మార్గంలో మొదటి మలుపు వద్ద కూడా ప్రమాదాలు సంభవిస్తుంటాయి. ఈ ప్రమాదాలకు సొరంగ మార్గంతో దాదాపుగా అడ్డుకట్ట పడే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు.

నిపుణులు పర్యవేక్షించాలి

గువ్వల చెరువు ఘాట్‌లో ప్రాథమికంగా నిపుణుల బృందం టన్నెల్‌కు సంబంధించిన అంశాలను పరిశీలించాల్సి వుంది. అలాగే అంచనా వ్యయంపై ఒక నిర్ణయానికి రావాలి. సాంకేతిక సమస్యలను అధిగమించాక కేంద్రం తగు నిర్ణయం తీసుకుంటుంది.

-సి.విజయభాస్కర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, జాతీయ రహదారులు భవనాల శాఖ కడప.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

చిన్నమండెం: ప్రకృతి సేద్యంతో పండించిన ఆహార ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చాకిబండ యూనిట్ పరిధిలో మల్లూరు గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయల వినియోగం వల్ల కలిగే లాభాలను తెలియజేశారు.

జంతు పరిశోధన నైతికతపై జాతీయ సదస్సు

మదనపల్లె రూరల్: మండలంలోని సీటీఎం క్రాస్‌రోడ్స్ మహతి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ(అటానమస్)లో జంతు పరిశోధనలో నైతిక అంశాలు, సంక్షేమ సాధనలు అనే అంశంపై శుక్రవారం జాతీయస్థాయి సదస్సు నిర్వహించారు. దేశవ్యాప్తంగా 323 మంది ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్.పీకే.ప్రకాష్‌రెడ్డి, సీసీఎస్‌ఈఏ ప్రతినిధి డాక్టర్.ఈశ్వర్‌టోనీ సంయుక్తంగా సదస్సును ప్రారంభించారు. మహతి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ చైర్మన్ బి.అమరనాథరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్.మహతి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.డాక్టర్.ఈశ్వర్‌టోనీ జంతు సంక్షేమం, డాక్టర్.సోమశేఖర్‌రెడ్డి త్రిసూత్రాలు, ప్రత్యామ్నాయ పద్ధతులు, డాక్టర్.హుస్సేన్‌సాహెబ్ నైతిక సవాళ్లను ప్రాక్టికల్‌గా ఎలా ఎదుర్కోవాలి, డాక్టర్.వినోద్ నెల్సన్ మహతి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో లభించే ఆధునిక పరిశోధనా వసతులపై సమగ్రంగా వివరణ ఇచ్చారు.

శాస్త్రోక్తంగా సౌమ్యనాథుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథస్వామి

నందలూరు: నందలూరులోని సౌమ్యనాథ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం సాయంత్రం అంకురార్పణ చేపట్టారు. ముందుగా సాయంత్రం 6 గంటల నుంచి పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం అనంతరం శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహించారు. అర్చకులు నవధాన్యాలు, కలశస్థాపనలు, పూర్ణకుంభ ప్రతిష్ట, పుణ్యాహవచనా బియ్యం, నెయ్యి, బెల్లం, టెంకాయలు, తమలపాకులు సమకూర్చారు.పాంచరాత్ర ఆగమ పండితుల బృందంతో కలశస్థాపన చేసి హోమం నిర్వహించారు. ఆగ్నేయమూలలో వెలసి ఉన్న పుట్ట వద్ద పూజలు జరిపారు. పుట్టమన్ను సేకరించి అంకురార్పణ మంటపంలో ఏర్పాటు చేసిన 12 పాలికలలో ఉంచారు. అందులో నవధాన్యాలు చల్లి అంకురింప చేసే కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం మూలవర్లు, ఉత్సవర్లకు తిరుమంజనం కార్యక్రమం జరిపారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ధ్వజారోహణం, రాత్రికి యాళి వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.



పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న పండితులు

- ఎన్నికల ప్రణాళిక అమల్లో కూటమి ప్రభుత్వం విఫలం
- బాబుష్యూరిటీ-మోసం గ్యారెంటీపై ఇంటింటా ప్రచారం
- రాజంపేట పార్లమెంట్ పరిశీలకుడు, కడప మేయర్ సురేష్‌బాబు

ప్రభుత్వం మెడలు వంచుదాం..

హామీలు అమలు చేయిద్దాం



మాట్లాడుతున్న పార్లమెంట్ పరిశీలకులు కె.సురేష్‌బాబు, చిత్రంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, సుగవాసి బాలసుబ్రమణ్యం తదితరులు



సమావేశానికి హాజరైన నియోజకవర్గ నాయకులు

రాయచోటి: కూటమి నేతల హామీలకు ష్యూరిటీ లేదని.. మోసాలే గ్యారెంటీ అని రాజంపేట పార్లమెంట్ పరిశీలకుడు, కడప మేయర్ కె.సురేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటిలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో జిల్లా నాయకులతో కలిసి కె.సురేష్‌బాబు పాల్గొన్నారు. అమలు చేయలేని హామీలను గుప్పించి ప్రజలను మోసగించి ఎన్నికల్లో గెలుపొందిన ఈ ప్రభుత్వం మెడలు వంచుదాం..హామీలు, సంక్షేమ పథకాలను అమలు చేయిద్దామన్నారు. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీని ఇంటింటా ప్రచారం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలను కోరారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను ఖురాన్, భగవద్గీత, బైబిల్‌లా భావించి హామీలు అమలు చేశారన్నారు. చంద్రబాబు సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్య పెట్టారన్నారు. ఇదే విషయాన్ని ఇంటింటికెళ్లి చంద్రబాబు మోసాలను వివరించాలని.. జగన్ హయాంలో ఏ విధంగా పథకాలు అందాయో తెలియజేయాలని పార్టీశ్రేణులను సురేష్‌బాబు కోరారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ, మండల నాయకులు, కార్యవర్గ సభ్యులు, అనుబంధాల విభాగాల నాయకులు, పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.

- ప్రజల్లోకి కూటమి ప్రభుత్వ మోసాలను తీసుకెళ్దామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఓట్లు వేయించుకుని అవసరం తీరాక హామీలను గాలికి వదిలేశారని విరుచుకుపడ్డారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం ఇంతవరకూ అందలేదన్నారు. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ అందిస్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేశారన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా, ఉద్యోగాలు కల్పించకుండా, నిరుద్యోగభృతి చెల్లించకుండా యువతను దగా చేశారన్నారు. 18 ఏళ్లు నిండి 59 ఏళ్ల వయస్సు వరకు మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని ఏడాది దాటినా ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. చంద్రబాబు ఎన్నికల హామీలను క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు వివరించి, ఏవిధంగా మోసం చేశారో ప్రజలను చైతన్యవంతులను చేయాలని పార్టీ శ్రేణులకు శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, ఒక బటన్ నొక్కితే చంద్రబాబునాయుడు మేనిఫెస్టో వివరాలు. మరో బటన్ నొక్కితే కూటమి వాగ్దానాలు నెరవేరకపోవడం వల్ల ఒక్కో కుటుంబం ఎంత నష్టపోయిందో లెక్కలు.. వివరాలు.. చూపిస్తాయని శ్రీకాంత్‌రెడ్డి వివరించారు.
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గాంధీ, అంబేడ్కర్ లాంటి మహానేతలతో తనను పోల్చుకుంటూ నేడు బాబా అవతారంలో ప్రజలను మోసగించడానికి ముందుకు వచ్చారని హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. లోకేష్ యువగళం పేరుతో యువతకు 20 లక్షల ఉద్యోగాలు అని చెప్పి మోసం చేశారన్నారు. ఇప్పుడు చంద్రబాబు కొత్తగా దొంగ బాబా అవతారం ఎత్తాడని.. ఆయనే చంద్రబాబా అంట.. అని ఎద్దేవా చేశారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్‌లాగా తాను కూడా పేద ఇండ్లలో నివాసం ఉన్నట్లు చంద్రబాబు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మహాత్మాగాంధీకి అంబేడ్కర్‌లకు 70 వేల కోట్ల రూపాయల వ్యాపారసంస్థలు ఉన్నాయా.. వారి బిడ్డలు మంత్రులు అయ్యారా అని ప్రశ్నించారు.. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో దోపిడీ జరుగుతోందని, పీ4 కాదు ఏ4 నడుస్తోందని తెలిపారు. రౌడీలకు, గూండాలకు టికెట్లు ఇచ్చాడని, వారు పెట్టుబడి పెట్టామని చెబుతూ దోపిడీలకు పాల్పడుతున్నారన్నారు. లక్కిరెడ్డిపల్లెలో 19 మంది వైఎస్సార్‌సీపీ నేతలపై దర్యాప్తు చేయకుండానే పోలీసులు అక్రమ కేసులు పెట్టారన్నారు. బాంబులు తయారుచేసే చట్టాన్ని ప్రయోగించారన్నారు. న్యాయవ్యవస్థపై నమ్మకంతో ప్రజలు బతుకుతున్నారన్నారు. రాష్ట్రంలో 40 శాతం ఓట్లు వేసిన వైఎస్సార్‌సీపీ వారికి సంక్షేమాలు ఇవ్వనంటున్నాడని, సంక్షేమ పథకాలు ఆపితే చంద్రబాబు చెప్పినట్లుగా కాలర్ పట్టుకుని నిలదీస్తామన్నారు. సంవత్సరానికి ఒక్కొక్క కుటుంబానికి లక్ష రూపాయలు మేలు చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు బాండ్లు ఇచ్చారని, వైఎస్‌ఆర్‌సీపీ అధికారంలో ఉన్నపుడు ఎవరూ రోడ్లపైకి వచ్చింది లేదన్నారు. కూటమి పాలనలో ఏడాదిలోనే ప్రతి ఒక్కరూ రోడ్డు ఎక్కారని రమేష్‌కుమార్‌రెడ్డి విమర్శించారు.
- కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు అధికారంలోకి వచ్చాక గాలిలో కలిసిపోయాయని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు. అవినీతి, అరాచకం, అక్రమ వసూళ్లు, తోపుడు బండ్ల నుంచి బడా వ్యాపారసంస్థల వరకు జరుగుతున్నాయని వివరించారు. ప్రతి మండలానికి గ్రామానికి, ప్రతి గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు కలిసి పార్టీని బలపరచాలని కోరారు.
- సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ దేవనాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు మాట్లాడారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని పూర్తి ఉత్సాహంతో, క్రమశిక్షణతో నిర్వహించి రాయచోటి నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలపాలని నాయకులు కోరారు. ప్రజల్లో చైతన్యం నింపి టీడీపీ మోసాలపై స్పష్టతనిస్తూ జగన్ పాలనలో అమలైన సంక్షేమ పథకాలను వివరించాలని నేతలు సూచించారు. టీడీపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం 2024 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలు అమలులో విఫలమైందని ప్రజలకు తెలియజేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు.

ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలం: ఆకేపాటి

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి విమర్శించారు. ప్రభుత్వం ప్రతిపక్ష హోదా ఇవ్వకపోయినా ప్రజల పక్షాన పోరాటం చేయాల్సిన అవసరం ఆసన్నమైందని ఆయన పిలుపునిచ్చారు. 15 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన చంద్రబాబుకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియనిది కాదన్నారు. ప్రజలను మోసం చేయడం, వెన్నుపోటు పొడవడం ఆయనకు తెలిసిన విద్య అని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి రోడ్డుపైకి వస్తేనే చంద్రబాబుకు వణుకు పుడుతోందన్నారు. నేడు రైతులు ఇబ్బందులు పడుతున్నా చంద్రబాబుకు కనికరం లేదన్నారు.

క్లుప్తంగా

ఆటో డ్రైవర్ నిజాయితీ


ఎస్‌ఐకు నగదు అందజేస్తున్న బావాజాన్

తంబళ్లపల్లె : తంబళ్లపల్లె మెయిన్ రోడ్డుపై దొరికిన నగదును ఆటోడ్రైవర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి నిజాయితీని చాటుకున్నారు. శుక్ర వారం ఆటో డ్రైవర్ బావాజాన్ రోడ్డుపై వెళు తుండగా రూ.23,300 నగదు దొరికింది. ఆ నగదును ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రెడ్డికి అందజే శాడు. ఆటో డ్రైవర్ నిజాయితీని ఎస్‌ఐ అభినం దించారు. విచారించి నగదు పోగొట్టుకున్న వారికి అందజేస్తామన్నారు.

వ్యక్తికి గాయాలు


ప్రమాదంలో గాయపడ్డ అబు సిద్దిక్

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని దొరిచెరువు వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో అబూ సిద్దిక్ అనే వ్యక్తికి తీవ్రగాయాలైనట్లు బంధువులు తెలిపారు. బంధువుల వివరాల మేరకు.. అబు సిద్దిక్ వేంపల్లి నుండి లక్కిరెడ్డిపల్లికి స్కూటీలో వస్తుండగా లక్కిరెడ్డిపల్లి నుండి కోనంపేటవైపు వెళుతున్న ట్రాక్టర్ ఢీ కొంది. అబు సిద్దిక్‌కు తీవ్ర గాయాలవడంతో 108 వాహనం ద్వారా లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కొరకు కడప రిమ్స్‌కు తరలించినట్లు సిబ్బంది తెలిపారు.

విద్యార్థులపై కత్తితో దాడి


దాడిలో గాయపడ్డ సంతోష్, శశినాయక్

పీలేరురూరల్ : ఇద్దరు విద్యార్థులపై కత్తితో దాడి చేసిన సంఘటన శుక్రవారం పీలేరు పట్టణం కడప రోడ్డులో చోటుచేసుకుంది. వివరాలిలా వున్నాయి. మండలంలోని యర్రగుంటపల్లె పంచాయతీ నెట్టిబండ కాలనీకి చెందిన వి.సంతోష్(16), సైనిక్‌నగర్‌కు చెందిన శశినాయక్(19) స్థానికంగా ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. అదే కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న హర్షవర్ధన్, రిహాన్ గొడవపడ్డారు. హర్షవర్ధన్ సోదరుడైన సంతోష్ వారిని వారించాడు. దీంతో రిహాన్ స్నేహితులు సాదిక్ ఉల్లా, తన స్నేహితులు ఐదుగురితో వచ్చి ఇరువురిపై కత్తితో దాడి చేశారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ యుగంధర్ తెలిపారు

వ్యక్తి అదృశ్యం

పులివెందుల రూరల్ : పట్టణంలోని సరస్వతి విద్యా మందిరం వద్ద నివసిస్తున్న పార్వతమ్మ కుమారుడు శ్రీనివాసులు అదృశ్యమయ్యాడు. శ్రీనివాసులుకు మతిస్థిమితం లేకపోవడంతో పట్టణంలో యాచిస్తుండేవాడు. ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో శ్రీనివాసులు తల్లి పార్వతమ్మ పులివెందుల పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసువిచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆలోచనకు పదును.. సృజనకు అదును

- ఇన్‌స్పైర్‌మనక్ -2025కు దరఖాస్తుల ఆహ్వానం
- బాల మేధావులకు గొప్ప అవకాశం
- సెప్టెంబర్ 15వ తేదీ వరకు నమోదుకు గడువు


జిల్లా సైన్సుఫేర్‌లో ప్రాజెక్టును ప్రదర్శించిన విద్యార్థులు (ఫైల్)

కడప ఎడ్యుకేషన్ : ఇన్‌స్పైర్ మనక్- 2005 అవార్డులకు వేళయింది. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను ప్రయోగాల వైపు నడిపించి.. వారి చిట్టి బుర్రలకు పదునుపెట్టి... కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టి.. వారిని భావి భారత శాస్త్ర వేత్తలుగా తయారుచేయాలనే లక్ష్యంతోభాగంగా భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం(డీఎస్‌టీ) ఏటా విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. జిల్లా స్థాయిలో ప్రతిభ చూసిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుంది. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులకు బాల శాస్త్రవేత్తలుగా నామకరణం చేసి రాష్ట్రపతి అవార్డు అందజేస్తారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు త్వరపడాల్సి ఉంది.

అర్హతలు... ఎంపికలు ఇలా

వైఎస్సార్ జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, ఎయిడెడ్, ప్రైవేటు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ఇన్‌స్పైర్ మనక్‌కు దరఖాస్తు చేసేందుకు అర్హులు. వారంతా తమ సైన్సు టీచర్‌ను గైడ్‌గా ఏర్పాటుచేసుకుని ఈ పరిశోధనలో పాల్గొనాల్సి ఉంటుంది. ప్రతి పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులు ఎంపిక చేస్తారు. స్థానిక సమస్యలను తీర్చే విధంగా ఆలోచనలుండాలి. తరగతి వారీగా ఉత్తమ ఆలోచన ఎంపిక చేసి అందుకు అవసరమైన ప్రాజెక్టు రూపొందించాలి. విద్యార్థి, తండ్రి పేర్లు, తరగతి నమోదు చేసి విద్యార్థికి సంబంధించిన బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు నెంబర్ ఎంటర్ చేయాలి. విద్యార్థి ప్రాజెక్టు రాత పూర్వకంగా సంబంధిత వెబ్ సైట్‌లో నమోదు చేయాలి. ప్రాజెక్టు పేరు, శాస్త్ర సాంకేతికతకు సంబంధించిన అంశాలు ఉండేలా చూసుకోవాలి. ప్రాజెక్టు ఎంపిక రెండు నెలల్లో పూర్తి చేసి జిల్లా స్థాయి ప్రతిభా వంతులను ప్రకటిస్తారు. తర్వాత రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. ఎంపికైన ప్రాజెక్టుకు ప్రయోగం నిమిత్తం బ్యాంకు ఖాతాల్లో రూ.10 వేలు జమ చేస్తారు. ఈ దరఖాస్తుకు గడువు సెప్టెంబర్ 15వ తేదీ వరకు ఉంది.

దరఖాస్తు చేసుకునే విధానం ఇలా...

ఇన్‌స్పైర్ అవార్డు మనాక్‌లో పాల్గొనేందుకు విద్యార్థులు ముందుగా www.inrpireawardrdrt.gov.in వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి. స్కూల్ అథారిటీ ఆప్షన్‌ను ఎంపిక చేయాలి. అందులో న్యూ రిజిస్ట్రేషన్ ఆప్షన్‌ను ఎంపిక చేయాలి. పాఠశాల వివరాలను పొందుపరిచి సేవ్ చేయాలి. సంబంధిత దరఖాస్తు జిల్లా అథారిటీకి చేరుతుంది. ఆమోదించిన తరువాత మనం ఇచ్చిన మొయిల్ ఐడీకి యూజర్ ఐడితో కూడిన లింక్ వస్తుంది. ఆ ఐడీతో పాస్‌వర్డు క్రియేట్ చేయాలి. అనంతరం విద్యార్థుల ప్రాజెక్టు వివరాలను అందులో నమోదుచేయాలి.

జాగ్రత్తలు పాటించాలి...

విద్యార్థులు తయారు చేసే ప్రాజెక్టులలో స్థానిక సమస్యలను ప్రతిబింబించి.. వాటికి పరిష్కార మార్గాలు చూపేలా ఉండాలి. పాతవైనా తాజా పరిస్థితులకు అన్వయించి పరిష్కారం చూపాలి. నమూనాల పొడవు, వెడల్పు ఒక మీటరు ఉండేలా చూసుకోవాలి. ప్రాజెక్టు రిపోర్టులో నమూనా పరిచయం, పని చేసే తీరు, ఉపయోగించే పరికరాలు, తయారీ విధానం, పనిచేసే తీరు. ఫలితాల అనువర్తనాలు తప్పని సరిగా ఉండాలి. ప్రాజెక్టుల పరిశీలనకు వచ్చే న్యాయ నిర్ణేతలకు నమూనా చూపించి ప్రాజెక్టు గురించి తడబాటు లేకుండా వివరించాలి.

ఎంపిక ప్రక్రియ...

విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులు, నమూనాలను జిల్లా స్థాయి ప్రదర్శనలో ఉంచుతారు. జిల్లా స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి పంపుతారు. అక్కడ విజయం సాధిస్తే జాతీయ స్థాయిలో పదర్శించే అవకాశం కల్పిస్తారు. జాతీయ స్థాయిలో ఎంపికైన వాటిని ఐఐటీ, నీట్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలకు అప్పగిస్తారు. వాటిని వారు గొప్ప నమూనాలుగా రూపొందిస్తారు. ఉత్తమ ప్రదర్శనల నుంచి జాతీయ స్థాయిలో పదర్శనలకు అవకాశం ఉంటుంది. వీటిలో పలు ప్రాజెక్టులను ఫైనల్‌గా ఎంపిక చేసి రాష్ట్రపతి భవన్‌లో జరిగే వారోత్సవాల్లో ప్రదర్శిస్తారు. ఈ ప్రాజెక్టులకు ప్రభుత్వం పెటెంట్ హక్కులు మంజూరు చేస్తుంది.

ప్రతి పాఠశాలలనుంచి...



ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్ల నమోదుకు సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు ఉంది. ప్రతి పాఠశాల నుంచి ప్రాజెక్టులు వచ్చేలా చూడాలి. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు భాగస్వాములు కావాలి. ఇందులో ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు, ఉన్నత పాఠశాల నుంచి 5 ప్రాజెక్టులను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఇందుకు ప్రతి సైన్సు ఉపాధ్యాయుడు కృషి చేయాలి.

– ఎబినైజర్, జిల్లా సైన్సు అధికారి

విద్యార్థులను ప్రోత్సహించండి



ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేసే సైన్సు ఉపాధ్యాయులందరూ విద్యార్థులను ప్రోత్సహించాలి. ప్రాజెక్టుల రూపకల్పనలో వారి ఆలోచనలను పరిగణనలోకి తీసుకోని నూతనత్వాన్ని ప్రతిబింబించేలా ప్రాజెక్టు సిద్ధం చేసుకోవాలి. ఇందుకు అన్ని పాఠశాలల సైన్సు ఉపాధ్యాయులు కృషిచేయాలి. అనుమానాలుంటే జిల్లా సైన్సు అధికారిని సంప్రదించాలి.

– షేక్ షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖాధికారి

ప్రశాంతంగా మొహర్రం పండుగ జరుపుకోండి

– జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు



రాయచోటి : జిల్లా ప్రజలు మొహర్రం పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించేవారిపై చట్టపరమైన చర్యలుంటాయన్నారు. గ్రామ పెద్దలు, చిన్నా, పెద్దా తేడాలేకుండా ఉత్తేజ భరితంగా జరుపుకొనే ఈ వేడుకలలో అల్లర్లకు తావుండరాదని హెచ్చరించారు. సోదర భావంతో మెలగాలని, చట్ట విరుద్ధగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలలో ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

కడప అర్బన్ : అనుమానంతో భార్యను వేధింపులకు గురి చేస్తూ గొంతునులిమి హత్య చేసిన కేసులో నిందితుడైన భర్త జరిపిటి మల్లికార్జున(41)కు జీవిత ఖైదు, రూ. 1,60,000 జరిమానా విధిస్తూ జడ్జి జీఎస్.రమేష్‌కుమార్ తీర్పు ఇచ్చారు. తంబళ్లపల్లి మండలం మేకావారిపల్లికి చెందిన జరిపిటి మల్లికార్జునకు కడప ఏఎస్‌ఆర్ నగర్‌కు చెందిన తమ్మిశెట్టి రమాదేవి కుమార్తె గంగాదేవితో 2012లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మల్లికార్జున పండ్లను విక్రయిస్తూ జీవించేవాడు. భార్య జరిపిటి గంగాదేవి(25)ని రోజూ అనుమానంతో వేధించాడు. 2019 మార్చి, 3న ఉదయం గొంతు నులిమి హత్య చేసినట్లు మృతురాలితల్లి తమ్మిశెట్టి రమాదేవి ఫిర్యాదు చేసింది. అప్పటి తాలూకా సీఐ ఎస్.విశ్వనాథరెడ్డి కేసు నమోదు చేసి మల్లికార్జునను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తు అనంతరం ఛార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో సాక్షాతో సహా నేరం నిరూపణ కావడంతో కడప కోర్టు జడ్జి మల్లికార్జునకు జీవిత ఖైదు, రూ.1,60,000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. సీఐ టి.రెడ్డెప్ప, కోర్ట్ కానిస్టేబుల్ ఎం.రఘురాముడు, కోర్ట్ మానిటరింగ్ సెల్ హెడ్ కానిస్టేబుల్ రాజులను ఎస్పీ ఈజీ.అశోక్ కుమార్ అభినందించారు.

ఏసీఏ అండర్-19 మల్టీ డే మ్యాచ్‌లు ప్రారంభం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్-19 మల్టీ మ్యాచ్‌లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజున వైఎస్సార్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు-చిత్తూరు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 77.3 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని మన్విత్ రెడ్డి 167 బంతులో 16 ఫోర్లు, 5 సిక్సర్లతో 140 పరుగులు చేశాడు. సయ్యద్ షాహుల్ హుస్సేన్ 63 పరుగులు చేశాడు చిత్తూరు జట్టులోని సాయి చరణ్ 3 వికెట్లు, ధనుష్‌రెడ్డి 3 వికెట్లు, తేజేష్2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 4 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 14 పరుగులు చేసింది. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

కెఓఆర్‌ఎం క్రికెట్ మైదానంలో.....

కెఓఆర్‌ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో కర్నూలు -అనంతపురం జట్లు తలపడ్డాయి, ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 59.3 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 213 పరుగులకు డిక్లేర్ చేసింది. ఆ జట్టులోని విష్ణు వర్ధన్ నాయుడు 68 పరుగులు, విఖ్యాత్ 4 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని నవదీప్ 4 వికెట్లు, టివి సాయి ప్రతాప్ రెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 29 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 139 పరుగులు చేసింది. ఆ జట్టులోని కెహెచ్ వీరారెడ్డి 62 పరుగులు చేశాడు.

బుద్ధ విగ్రహం తల తొలగింపు వెనుక ఆర్‌ఎస్‌ఎస్ హస్తం


అరగుండు, అరమీసంతో నిరసన తెలుపుతున్న బౌద్ధులు, తదితరులు

మదనపల్లె రూరల్ : తథాగతుడు గౌతమ బుద్ధుడి విగ్రహానికి తల తొలగించడాన్ని నిరసిస్తూ భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) చేపట్టిన దీక్ష శుక్రవారం రెండో రోజుకు చేరింది. కేసును తప్పుదోవ పట్టించి, నిందితుల్ని కాపాడేందుకు మదనపల్లె తాలూకా సీఐ కళా వెంకటరమణ ప్రయత్నిస్తున్నారంటూ పది మంది బౌద్ధులు అరగుండు, అర మీసంతో వినూత్నంగా శుక్రవారం నిరసన తెలియజేశారు. దళిత సేన కర్ణాటక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీడా శ్రీనివాస్ ఆధ్వర్యంలో దళిత సేన సభ్యులు దీక్షకు సంఘీభావం ప్రకటించారు. బీడా శ్రీనివాస్ మాట్లాడుతూ బుద్ధుడి తల తొలగించిన మతోన్మాదులను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామన్నారు. బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీయం శివప్రసాద్ మాట్లాడుతూ బుద్ధ విహారను మానవ వికాస కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో రెండు కోట్ల రూపాయలతోపనులు చేశామన్నారు. కొందరు ఉన్మాదులు పని గట్టుకొని ఒక్కొక్కటీ ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాలూకా సీఐ కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని ప్రత్యేక పోలీస్ బృందం ద్వారా కేసును ఇన్వెస్టిగేట్ చేయించాలని డిమాండ్ చేశారు. అనంతరం దీక్షా శిబిరం వద్దకు పోలీసులు చేరుకుని దీక్ష భగ్నం చేయడానికి ప్రయత్నించడంతో తోపులాట జరిగింది. ముత్యాల మోహన్, చాట్ల బయన్న, గంపల రమణ, వై.గంగాధర్, తలారి కృష్ణ, నాగరాజు, నీరుగట్టి రమణ, కోనేటి దివాకర్, ఆవుల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : కుటుంబ కలహాలతో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం జరిగింది. కురబలకోట మండలం సింగన్నగారిపల్లెకు చెందిన సుదర్శన్(40) వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నాడు. కుటుంబ కలహాలతో ఇంట్లోనే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు అతడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. పుంగనూరు మండలం రాంపల్లెకు చెందిన వెంకటరమణ భార్య వెంకటమ్మ(48) కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయతి్నంచింది. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిలా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మానవత్వం మరచిన ఆటో డ్రైవర్

రోడ్డు పక్కన మృతదేహాన్ని దించి వెళ్లిన వైనం


యల్లంపల్లి సమీపంలో మహిళతో మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటరెడ్డి

కలికిరి : మానవత్వం మంట గలిచింది. అకస్మాత్తుగా మృత్యువాత పడిన అభాగ్యుడిని ఆదుకోవాల్సింది పోయి.. రోడ్డు పక్కన పడేసి వెళ్లిన వైనం శుక్రవారం వెలుగు చూసింది. కలికిరి మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సోమల మండలం మిట్టూరుకు చెందిన ఎన్.రమేష్(48) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం ఉదయం కలికిరికి చికిత్స నిమిత్తం భార్య, మనుమరాలితో వచ్చాడు. చికిత్స అనంతరం తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా కలికిరి కందూరు రోడ్డు మార్గంలో యల్లంపల్లి బస్టాపు వద్ద దాహమేస్తోందని అడిగి ఆటో నిలుపుమన్నారు. నీళ్లు తాగుతుండగా పక్కకు ఒరిగి ప్రాణాలొదిలాడు. ఆటోడ్రైవర్ ఆ మృత దేహాన్ని రోడ్డుపక్కన పెట్టేసి అతని భార్య, చిన్న పాపను వదిలేసి వెళ్లిపోయాడు. దిక్కుతోచని స్థితిలో మృతుడి భార్య రోదిస్తుండటంతో అటుగా వెళుతున్న గుట్టపాళెం సర్పంచ్ రెడ్డివారి వెంకటరెడ్డి గమనించి మృతదేహాన్ని తరలించడానికి వాహనం ఏర్పాటుచేసి మానవత్వం చాటుకున్నారు. మృతదేహాన్ని, మహిళను, చిన్నారిని రోడ్డుపక్కన వదిలేసి వెళ్లిన ఆటో డ్రైవరు తీరుపై పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

దేశం కోసం జీవితాన్ని త్యాగం చేసిన వీరుడు అల్లూరి


నివాళులర్పిస్తున్న ఏఎస్పీ వెంకటాద్రి


మాట్లాడుతున్న డీఆర్‌ఓ మధుసూదన్‌రావు

జిల్లా అదనపు ఎస్పీ

రాయచోటి : దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి అన్నారు. స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి అదనపు ఎస్పీ శుక్రవారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మన్యం వాసుల కష్టాలను కడతేర్చటానికి, తెల్లదొరల దోపిడీని ఎదుర్కొని గిరిజనులకు సీతారామరాజు అండగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయచోటి డీఎస్పీ ఎంఆర్. కృష్ణమోహన్, ఏఆర్ డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శంకరమల్లయ్య, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎం.తులసీరాం, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు విజె.రామకృష్ణ, టి.జాన్, జోసెఫ్, ఎం.పెద్దయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వరాజ్య సంగ్రామంలో అల్లూరి మహోజ్వల శక్తి

రాయచోటి : స్వరాజ్య సంగ్రామ చరిత్రలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని, ఆయన దేశభక్తి, ధైర్యాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని డీఆర్‌ఓ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో సీతారామరాజు చిత్రపటానికి డీఆర్‌ఓ శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ సీఈఓ సాయి గ్రేస్‌లీ, మేనేజర్ వివి.సుబ్బరాయుడు, డీఈఓ సుబ్రహ్మణ్యం, ఏపీ టూరిజం అధికారి నాగభూషణం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువతి హత్య కేసులో ముగ్గురు నిందితులకు జైలు

కడప అర్బన్ : వైఎస్‌ఆర్ జిల్లా పోరుమామిళ్ల పీఎస్ పరిధిలో జరిగిన మతిస్థిమితం లేని యువతి హత్య కేసులో పోరుమామిళ్ల టౌన్ బెస్త వీధికి చెందిన షేక్ జిలానీ బాషా(26), కలసపాడు మండలం కట్టకిందపల్లికి చెందిన కారు నాగేంద్ర ప్రసాద్(25), పోరుమామిళ్లలోని తురకకోట వీధికి చెందిన షేక్ మహబూబ్ బాషా(26) లకు పదేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ కడప నాలుగో ఏడీజే కోర్టు జడ్జి జి.దీనాబాబు తీర్పు ఇచ్చారు. పోరుమామిళ్ల పీఎస్ పరిధిలోని రామాయపల్లి శ్మశానం వద్ద 2019 జూలై, 11న హత్య జరిగింది. ముగ్గురు నిందితులు మతిస్థిమితం లేని యువతిని గొంతు నులిమి హత్య చేశారు. అప్పటి వీఆర్‌ఓ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ మోహన్‌రెడ్డి కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. విచారణలో యువతి గొంతు నులిమి హత్య చేసినట్లు రుజువు కావడంతో శుక్రవారం ముగ్గురికి పది సంవత్సరాల జైలు శిక్ష, రూ. వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు. సీఐ మోహన్ రెడ్డి, సీపీడీ శ్రీనివాసులు, కొండారెడ్డి, వెంకట సుబ్బయ్యలను ఎస్పీ అభినందించారు.

కార్మిక చట్టాలను రక్షించుకుందాం


సమావేశంలో మాట్లాడుతున్న రామాంజులు, సాంబశివయ్య

రాయచోటి టౌన్ : కార్మిక చట్టాలను రక్షించుకొందామని సీఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎ.రామాంజులు, సాంబశివయ్య పిలుపునిచ్చారు. రాయచోటి సీఐటీయూ కార్యాలయం ఎదుట విలేకరులతో శుక్రవారం వారు మాట్లాడుతూ కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే విధంగా బీజేపీ ప్రభుత్వం 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందన్నారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచడం సరికాదన్నారు. గత 15 సంవత్సరాలుగా కార్మికులకు వేతనాలు సవరించలేదని, సంక్షేమ బోర్డుకు ఛైర్మన్, కమిటీ సభ్యులను నియమించలేదన్నారు. మహిళలపై లైగింగ వేధింపులు, హత్య, అత్యాచారాలు జరుగుతున్నాయని, వారు రాత్రిళ్లు ఎలా విధులు నిర్వహిస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన మార్పులను వెంటనే ఉపసంహరించుకోవాలి కోరారు. ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి ఎల్‌అండ్‌టీ సుబ్రహ్మణ్యన్‌లు కార్మికుల శ్రమ దోపిడీ చేసి లాభాలు గడించేందుకు మాట్లాడుతున్నారని ఆరోపించారు. యూనియన్ పెట్టుకొనే హక్కు, సమ్మెచేసుకొనే హక్కు, పీఎఫ్, ఈఎస్‌ఐగా డ్యూటీ, నిర్వీర్యం అవుతుందన్నారు. కార్మిక అనుకూల విధానాలు తెస్తామని చెప్పి.. ఇప్పుడేమో పెట్టుబడుదారులకు అనుకూలమైన విధానాలను అనుసరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ టౌన్ కమిటీ అధ్యక్షుడు యం.చెన్నయ్య వంగిమళ్ల రంగారెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి నరసింహులు, ఏఐటీయూసీ వర్కర్స్ యూనియన్ జల్లా అధ్యక్షులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్కూటీ డిక్కీలో డబ్బు అపహరణ

వేంపల్లె : పట్టణంలోని పులివెందుల రోడ్డులో నిలిపిన స్కూటీ డిక్కీలో ఉన్న డబ్బును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు బాధితుడు బి.భాస్కర్ రావు తెలిపారు. బాధితుడి కథనం మేరకు.. వేంపల్లె-కుప్పాలపల్లె రహదారిలో ఉర్దూ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న భాస్కర్ రావు శుక్రవారం ఎస్‌బీఐ బ్యాంకుకు వెళ్లి రూ.10 వేలు డ్రా చేసి స్కూటీ డిక్కీలో పెట్టారు. అనంతరం బ్యాంకు నుంచి పులివెందుల రోడ్డులోని ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయం వద్ద స్కూటీ పెట్టి సూపర్ మార్కెట్‌లోకి వెళ్లారు. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు స్కూటీ వద్దకు వచ్చి చాకచక్యంగా డిక్కీ తెరిచి డబ్బును దొంగలించారు. బాధితుడు బయటికి వచ్చి డిక్కీలో డబ్బు చూసుకోగా డబ్బుతోపాటు, చెక్‌బుక్, ఆఫీసుకు చెందిన పత్రాలు కూడా చోరీ చేసినట్లు బాధితుడు తెలిపారు.

ఆర్టీసీలో పదివేల ఉద్యోగాలు ఖాళీ


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

రాయచోటి టౌన్ : ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులకు వెంటనే అనుమతులు ఇవ్వాలని ఏపీ పీటీడీ(ఎంప్లాయీస్ యూనియన్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ.నరసయ్య డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఎంప్లాయీస్ నాయకులతో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 30 రకాల డిమాండ్లతో జులై 4, 5వ తేదీలలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావడంతోపాటు టీ/ భోజన విరామ సమయంలో ధర్నా, గేట్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2020లో గత ప్రభుత్వ విలీనం చేసిన తరువాత వివిధ కారణాలతో ఆరేళ్లుగా పదోన్నతులు లేకుండా పదవీ విరమణ చేశారని చెప్పారు. 3000 మందికి సంబంధించిన ఫైల్ ప్రస్తుతం అన్ని అనుమతులు పొంది ముఖ్యమంత్రి ఆదేశాల కోసం పెండింగ్‌లో ఉందన్నారు. 11వ పీఆర్‌సీ, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యూటీ చెల్లించలేదన్నారు. హెల్త్‌కార్డుల ద్వారా సరైన వైద్య సౌకర్యాలు అందపోవడంతో ఏటా 350 మంది చనిపోతున్నారని అన్నారు. డబుల్ డ్యూటీ చేస్తున్న సిబ్బందికి ప్రస్తుతం ఇస్తున్న దానికంటే వేతనం పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్‌పీ.బాబు, జిల్లా గౌరవాధ్యక్షుడు పి.నాగభూషణంరెడ్డి, జిల్లా అధ్యక్షుడు సి.ఆనందబాబు, జిల్లా కోశాధికారి కొండా ఈశ్వర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పి.శరత్‌బాబు, రాయచోటి డిపో అధ్యక్షుడు ఎస్ ఏ.సమద్, కార్యదర్శి జిఎం.రెడ్డి, గ్యారేజీ కార్యదర్శి మనోజ్ పాల్గొన్నారు.

రైళ్లలో పోలీసుల తనిఖీలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా నిర్మూలనే లక్ష్యంగా ఈగల్ టీం జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు రైళ్లలో తనిఖీలు నిర్వహించారు. కడప రైల్వే స్టేషన్‌తోపాటు ఎర్రగుంట-కడప మార్గంలో ముంబై నుంచి చెన్నై ఎగ్మోర్ వెళ్తున్న రైలులో కడప మహిళా పీఎస్ డీఎస్పీ బాలస్వామి రెడ్డి ఆధ్వర్యంలో ఈగల్, రైల్వే జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, పోలీసు, డాగ్ స్క్వాడ్ టీంలతో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ బాలస్వామిరెడ్డి మాట్లాడుతూ జనరల్ బోగి నుంచి ఏసీ బోగీల వరకు అన్నింటినీ తనిఖీ చేయడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా ఈ తనిఖీలు కొనసాగుతున్నాయని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా నిర్మూలన కొరకు ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్ 1972 ఏర్పాటుచేశారని, ఈ నెంబర్‌కు సమాచారం అందిస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ తనిఖీలలో కడప వన్‌టౌన్ ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి, కడప రైల్వే ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, స్పెషల్ పార్టీ, ఈగల్ టీం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.